

సక్రమంగా పంపిణీ కాని పోల్ చిట్టీలు

సిర్పూర్(టి), మే 11: మండలంలో 16గ్రామ పంచాయతీ ల్లోని 29పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్వోలు పోల్ చిట్టీలు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటివరకు కేవలం 50శాతం పోల్ చిట్టీలు కూడా పంపిణీ చేయలేదు. కేవలం మండల కేంద్రంలో కూడా ఎక్కువగా పోల్ చిట్టీలు పంపిణీ చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోల్ చిట్టీలు పంపిణీచేయాలని ఓటర్లు కోరుతున్నారు.

ప్రచారం పరిసమాప్తం

● నియోజకవర్గాన్ని వీడిన స్థానికేతరులు
● ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధం
● ఎన్నికల సామాగ్రి పంపిణీకి ఏర్పాట్లు
● జిల్లాలో 676 పోలింగ్ కేంద్రాలు



ఆసిఫాబాద్, మే 11: లోక్‌సభ ఎన్నికల పర్వంలో కీలక ఘట్టమైన ప్రచారానికి శనివారం సాయంత్రం ఐదుగంటలకు తెరపడింది. దీంతో ప్రచారపర్వానికి అభ్యర్థులు, అభ్యర్థుల తరుపున నేతలు ఫుల్‌స్టాప్ పెట్టారు. ఇక అన్ని పార్టీలు క్షేత్ర స్థాయిలో నాయకులను, కార్యకర్తలను మోహరించి విజయమే పరమావధిగా ఓటర్లను ఆకట్టుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇన్నాళ్లు జరిగిన ప్రచారం ఒకెత్తు అయితే నేడు,రేపు,పోలింగ్‌ముందు కీలకసమయం కావటంతో గెలుపు, ఓటములను ప్రభావితం చేసే సమయంగా అన్ని పార్టీలు భావిస్తున్నాయి. దీంతో ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు ప్రయత్నాలు చేపట్టనున్నారు. పార్లమెంటు ఎన్నికల పోలింగ్‌కు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. ఈనెల 13న పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏరాట్లను చేశారు. జిల్లాలో మొత్తం 676 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

బరిలో 12మంది..

ఆదిలాబాద్ పార్లమెంటు స్థానానికి మొత్తం 12మంది బరిలో ఉన్నారు. వీరిలో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పోటీ నెలకొని ఉంది. స్వతంత్ర అభ్యర్థులు మిగితా వారి ప్రభావం అంతంత మాత్రమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లాలో 4,56,329 ఓటర్లు..

జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూరునియోజకవర్గాలను కలిపిమొత్తం 4,56,309మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 2,27,310పురుషులు, 2,28,971మహిళ ఓటర్లు, 28మంది ఇతర ఓటర్లు ఉన్నారు. జిల్లాలో రెండు నియోజకవర్గాల్లో 676పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటుచేశారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో356 పోలింగ్‌కేంద్రాలు, సిర్పూరు నియోజకవర్గంలో 320పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేయగా, మొత్తం ఎన్నికల నిర్వహణకు 2వేల పైచిలుకు మంది ఉద్యోగులకు పోలింగ్ విధులు కేటాయించారు.

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు..

లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగియటంతో సోమవారం ఎన్నికలను సజావుగా నిర్వహించటానికి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గల్లో మొత్తం 676పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామాగ్రి తరలించేందుకు కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని పోలింగ్‌కేంద్రాలకు సామాగ్రిని తరలించేందుకు ఆసిఫాబాద్‌పట్టణంలోని గిరిజనబాలుర పాఠశాలలో, సిర్పూరు నియోజకవర్గానికి సంబంధించి కాగజ్‌నగర్‌పట్టణంలో సెయింట్‌క్లారెట్ పాఠశాలలో పంపిణీకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయాకేంద్రాలవద్ద ఏర్పాటుపనులను పూర్తి చేశారు. ఆదివారం ఆయా కేంద్రాలవద్ద ఎన్నికల సిబ్బందికి సామగ్రిని పంపిణీ చేయనున్నారు. పోలింగ్‌కేంద్రాల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రికార్డింగ్‌తోపాటు వెబ్‌కాస్టింగ్ డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా అమలు చేయనున్నారు. జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ సురేష్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాట్లను పూర్తి చేశారు.

అగ్ని ప్రమాదం జరిగితే అంతే..

● జిల్లాలో రెండే అగ్నిమాపక కేంద్రాలు
● అందులోనూ సిబ్బంది కొరత
● శిథిలావస్థలో ఫైర్ స్టేషన్లు
● పట్టించుకోని పాలకులు, అధికారులు





బెజ్జూరు, మే 11: ఎండాకాలంలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువ. చిన్నపాటి నిప్పు రవ్వ పడ్డా క్షణకాలంలో మంటలు పెద్ద ఎత్తున వ్యాపిస్తాయి. వాటిని అదుపు చేయడానికి అగ్నిమాపక యంత్రాలు అందుబాటులో ఉండాలి. కానీ జిల్లావ్యాప్తంగా రెండే ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. కనీసం రెండు మండలాలకు ఒక్కటన్నా ఫైర్ స్టేషన్ ఉండాలి. కానీ కేవలం కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లో మాత్రమే ఇవి ఉన్నాయి. దీంతో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు నష్టం, ప్రాణ నష్టం తీవ్రస్థాయిలో ఉండే అవకాశం ఉంది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాగా ఏర్పడినప్పటికీ అగ్ని మాపక శాఖలో మాత్రం జిల్లాల విభజన జరగలేదు. జిల్లా విస్తీర్ణం అధికంగా ఉండడంతో దూర భారం పెరిగి ప్రమాదస్థలానికి సరైన సమయంలో ఫైర్‌ఇంజన్ చేరుకోవడానికి వీలు పడడం లేదు. దీంతో జరగాల్సిన నష్టం జరిగాకగానీ అగ్నిమాపక సిబ్బంది రారు అనే విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

50 వేల మందికి ఒక ఫైర్ స్టేషన్..

ప్రభుత్వ లెక్కల ప్రకారం జిల్లాలో 5.15లక్షల మంది ప్రజలు ఉన్నారు. అగ్ని మాపకశాఖ ప్రకారం 50వేల జనాభాకు ఒక్క ఫైర్‌స్టేషన్ ఉండాలి. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా సుమారు 10స్టేషన్లు ఉండాల్సి ఉండగా రెండు మాత్రమే ఉన్నాయి. దీంతో దూరాభారం, సమయపాలన సరిపోక ప్రమాద స్థలానికి చేరే లోపు జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ప్రమాద సంఘటన సమాచారంతో అప్రమత్తమై బయలు దేరినప్పటికీ సరైన సమయంలో ఘటనా స్థలానికి చేరుకోలేక పోవడంతో ప్రమాదతీవ్రతను తగ్గించలేక పోతున్నారు. జిల్లాలో ఎక్కువ అటవీప్రాంతం ఉండడం, సరైన రోడ్డు సౌకర్యం లేక పోవడం, కెరమెరి, జైనూర్, బెజ్జూరు, దహెగాం లాంటి ప్రాంతాలకు చేరుకోవడానికి సుమారు రెండు గంటలకు పైగా సమయం పడుతుంది. దీంతో జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ముఖ్యంగా జిల్లాలో ఏడు నుంచి ఎనిమిది జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ఎండాకాలంలో పత్తి జిన్నింగ్‌లలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

వెక్కిరిస్తున్న ఖాళీలు..

జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లో అగ్నిమాపక కేంద్రాలున్నాయి. ఈ రెండింటిలో మొత్తం ఫైర్‌మెన్ కేడర్‌లో 20 పోస్టు లు ఉండాల్సి ఉండగా 11ఖాళీగా ఉన్నాయి. డ్రైవర్లు ఆరుగురు ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే పని చేస్తున్నారు. అంతేకాక ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ అగ్నిమాపక కేంద్రాల భవనాలు శిథిలావస్థకు చేరుకొన్నాయి. అవి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితులు ఉన్నాయి. చుట్టు కంపౌండ్ వాల్ కూడా లేదు. కంపౌండ్ వాల్ నిర్మాణానికి పలుమార్లు ప్రతిపాదనలు పంపినా ఫలితం లేకుండా పోయింది. దీంతో విషపురుగులు స్టేషన్‌లోకి వస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు. జిల్లా కేంద్రం ఏర్పడ్డాక ఆసిఫాబాద్‌లో అగ్ని మాపకశాఖకు కొత్త భవనం నిర్మించడానికి స్థలాన్ని చూపించాలని రెవెన్యూ అధికారులకు విన్నవించడం జరిగిందని, వారు రెండు మూడు చోట్ల స్థలాన్ని చూపించగా అక్కడ సౌకర్యాల లేమి ఉందన్నారు. ఈ మధ్యనే అనుకూలమైన స్థలాన్ని ఎంపిక చేయడంతో భవన నిర్మాణానికి ప్రదిపాదనలు పం పిం చినట్లు అగ్నిమాపక అధికారి పేర్కొన్నారు.

> ఎటు వెళ్లాలన్నా 70కి.మీటర్ల దూరం..

బెజ్జూరు, పెంచికలపేట మండలాల్లోని మారుమూల ప్రాంతాల్లో ప్రమా దాలు జరిగితే కాగజ్‌నగర్ నుంచి అగ్నిమాపక యంత్రం రావాల్సి ఉంటుంది. అదే సమయంలో అందుబాటులో లేనట్లయితే ఇక చెప్పనక్కర్లేదు. కాగజ్‌నగర్ నుంచి ఎటు వెళ్లాలన్నా సుమారు 70కి.మీటర్ల ప్రయాణించాల్సి ఉంటుంది. ఆలోపు వాహనం చేరుకునే సరికి ఆస్తినష్టం పూర్తిగా జరిగిపోతుంది. గతంలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పు పాలకులు ఈ ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారే తప్ప ఆచరణలో అమలు చేయలేదు. ముఖ్యంగా పెంచికలపేట మండలంలోని మురళిగూడ, జిల్లెడ, నందిగాం వంటి అటవీప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరిగితే సరైన రోడ్డు సౌకర్యం లేక ఫైర్‌ఇంజన్ ఆయాగ్రామాలకు వెళ్లలేని పరిస్థితులు ఉన్నాయి. దీంతో అక్కడి ప్రజలు దేవుడిపైనే భారం వేయాల్సి ఉంటోంది.

రెండేళ్లలో 100కుపైగా ప్రమాదాలు..

అగ్నిమాపకశాఖ లెక్కల ప్రకారం రెండేళ్లలో జిల్లాలో 100కుపైగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో 25లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. సుమారు 42లక్షల మేర అగ్ని ప్రమాదాల్లో ఆస్తులను కాపాడారు. ప్రమాదాలు జరిగిన చోట సిబ్బంది తక్షణమే అందుబాటులో ఉన్నచోట మంటలు ఆర్పి ఆస్తినష్టం వాటిల్లకుండా చేశారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో ఇళ్ల ఆవరణలో గడ్డివాములు ఏర్పాటు చేయడం, ఇంకా పల్లెల్లో వంటచెరుకుతో వంట చేయడం, ఆ తర్వాత అగ్గిని చల్లార్చకపోవడంతోనే అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఇంట్లో దీపాలు పెట్టి పను లకు వెళ్లడం వల్ల గాలులకు మంటలు చెలరేగి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా అగ్ని ప్రమాదాలపై అవగాహన లేని కారణంగా ప్రమాదాలు సంభవించి ఆస్తినష్టం సంభవించి సర్వం కోల్పోయి రోడ్డున పడుతున్నారు.

ఆర్థికసాయం అందజేత

కౌటాల, మే 11: మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామానికి చెందిన సామాజిక రచయిత, గాయకుడు, వికలాంగుల సంఘం జిల్లా అధ్య క్షుడు అనిల్ కోసన్‌కార్ ఇంటి పైకప్పు ఇటీవల కురిసిన భారీవర్షం, ఈదురుగాలులకు పడిపోయింది. దీంతో దీనస్థితిలో ఉన్న అనిల్ విషయం తెలుసుకున్న డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మాంతయ్య శనివారం రూ.5వేలఆర్థికసాయం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్‌ను సంప్రదించి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నాయకులు గణపతి, నహీం అహ్మద్ తదితరులు ఉన్నారు.

ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా పటిష్ట భద్రత: ఎస్పీ



ఆసిఫాబాద్‌లో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, మే 11: పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి జిల్లా పోలీసు యంత్రాంగం సర్వంసిద్ధంగా ఉందని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. ఈనెల13న జరిగేఎన్నికల్లో భాగంగా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భద్రత ఏర్పాట్లలో భాగంగా జిల్లా కేంద్రంతోపాటు కాగ జ్‌నగర్‌పట్టణంలోని ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను శనివారం పరిశీలించారు. బందోబస్తునిమిత్తం జిల్లాకు వచ్చిన పోలీసుసిబ్బంది వసతి సదుపాయాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వజ్రాయుధమని ఓటుహక్కు ఉన్న ప్రతిఒక్కరు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకోవా లన్నారు. అందుకు అన్ని భద్రత ఏర్పాట్లు చేశామన్నారు.

ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ

కాగజ్‌నగర్: ఎంపీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని శనివారం ఎస్పీ సురేష్‌కుమార్ పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాట్లు తదితర అంశాలపై తహసీల్దార్ కిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అంతా సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట డీఎస్పీ కరుణాకర్, సిబ్బంది ఉన్నారు.

మే13, జూన్ 4న వేతనంతో కూడిన సెలవు

ఆసిఫాబాద్, మే 11: లోక్‌సభ ఎన్నికలదృష్ట్యా ఈనెల13న పోలింగ్, జూన్4న కౌంటింగ్ కార్యక్రమాల రోజున భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లలో ఈనెల13న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల, విద్యాసంస్థలకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేశామన్నారు. పోలింగ్ కార్యక్రమం నిర్వహణకు అవసరమైన సామగ్రి సమకూర్చడం ఇతర పనుల కొరకు పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటుచేసిన విద్యాసంస్థలు,కళాశాలలు, కార్యాలయాలకు పోలింగ్ ముందురోజు అయిన ఈ నెల12న వేతనంతో కూడిన సెలవు మంజూరు చేశామని తెలిపారు.

వైన్‌షాప్‌లు బంద్

ఆసిఫాబాద్, మే 11: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీసెగ్మెంట్‌లలో ఈనెల 13న పోలింగ్, జూన్4న కౌంటింగ్ జరుగనున్న దృష్ట్యా జిల్లాలోని వైన్‌షాపులు, బార్‌లు మూసిఉంచాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ కార్యక్రమం నిర్వహణలో భాగంగా శనివారం సాయంత్రం 4నుంచి 13వ తేదీ పోలింగ్ ముగిసేవరకు, కౌంటింగ్ కార్యక్రమంలో భాగంగాజూన్4న కౌంటింగ్ పూర్తయ్యేవరకు మూసి ఉంచాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా జరిగేవిధంగా అందరూ సహకరించాలని తెలిపారు.

అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కాగజ్‌నగర్, మే 11: త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికల కోసం సంబంధించిన వివరాలను డిస్ట్రిబ్యూషన్ సిబ్బంది, రిసెప్షన్ సెంటర్, సెక్టోరియల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం నవోదయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈనెల 12న పోలింగ్ విధులకు హాజరయ్యే సిబ్బంది రిపోర్టు చేయాలన్నారు. ఎలక్ట్రానిక్ యంత్రాలు మినహా మిగిలిన సామగ్రి సెక్టార్ అధికారి ఆధ్వర్యంలో సిబ్బందికి అందజేస్తామన్నారు. ఎన్నికలు ముగించు కున్న తర్వాత ఈవీఎం, ఇతర సామగ్రిని రిసెప్షన్ సిబ్బంది అన్నివివరాలతో తీసుకోవాల్సి ఉంటుంద న్నారు. ఎకౌంట్‌ఆఫ్‌ఓట్స్, పీవో, డైరీ, మార్క్ పోలింగ్ తదితర అంశాలను పరిశీలించుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవోసురేష్, తహసీల్దారు, ఎన్నికల సిబ్బంది, ప్రిసైడింగ్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి మాత ధ్యాన మందిరం ప్రారంభం

బెజ్జూరు, మే 11: మండల కేంద్రంలో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం చౌడేశ్వరిమాత ధ్యాన మందిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్యాంసుందర్, రవికుమార్, శేఖర్, రాజమౌళి, చంద్రమౌళి, జి.చంద్రమౌళి, మహేష్, శంకర్, బాపు, సమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రచారం

సిర్పూర్(టి), మే 11: మండల కేంద్రంలో శనివారం వార సంతలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కుకు మద్దతుగా ఎమ్మెల్సీ దండెవిఠల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే రైల్వేస్టేషన్, బస్టాండు ఏరియా, వార సంతలో ప్రచారం నిర్వహించారు. అలాగే బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆటోలద్వారా ప్రచారం నిర్వహిం చారు. కాగా సాయంత్రం మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్, ఇతర ప్రాంతాల్లో ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు ఉండకూడదని ఎస్సై దీకొండరమేష్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు.

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు



విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కాగజ్‌నగర్, మే 11: శుక్రవారం కురిసిన అకాల వర్షాలకు మండలంలోని సార్సాల, కొత్తసార్సాల, రాస్పెల్లి ప్రధాన మార్గాల్లో విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. దీంతో టీఎస్ఎన్‌పీడీఎల్ జీఎం గౌతం రెడ్డి, డీఈ నాగరాజు ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికను ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది శనివారం మరమ్మతు పనులను చేపట్టారు. పడిపోయిన విద్యుత్‌స్తంభాల స్థానంలో కొత్తవి బిగించి విద్యుత్‌సరఫరాను పునరుద్ధరించారు. కార్యక్రమంలో ఏఈ జగన్‌మోహన్, సిబ్బంది పాల్గొన్నారు. త్వరితగతిన పనులు చేయటంపై మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెల్పించాలి

● ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చీకోటి ప్రవీణ్



బహిరంగ సభలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు చీకోటి ప్రవీణ్

కాగజ్‌నగర్, మే 11: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఆదరించి అభ్యర్థి గోడం నగేష్‌ను అధికమెజార్టీతో గెల్పించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చీకోటి ప్రవీణ్ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పీఎం మోదీ ప్రభుత్వం దేశం, ధర్మం కోసం పని చేస్తోందన్నారు. మచ్చలేని పాలన అందిస్తోందన్నారు. రాజస్థాన్ పాలి ఎమ్మెల్యే సునీల్ చౌదరి మాట్లాడుతూ పీఎం మోదీ చక్కటి పాలన అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీని గెల్పిస్తే ఈ ప్రాంతానికి నిధుల వరద వస్తుందన్నారు. రైళ్ల సమస్యలు పరిష్కార మవుతాయన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెల్పించాలన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు కొంగ సత్యనారాయణ, సిందం శ్రీనివాస్, ఆశోక్, ప్రముఖ వ్యాపారుల చిలువేరు ప్రవీణ్, రఘు, జవార్, లోయ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి పలువురి చేరిక

బీఎస్పీ, కాంగ్రెస్‌పార్టీలకు చెందిన కొంత మంది కార్యకర్తలు శనివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర హరీష్‌బాబు పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం అంతా కృషి చేయాలన్నారు.

మాలిలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి



కెరమెరిలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి సీతక్క

కెరమెరి, మే 11: మాలి కుల స్తుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారిని సామాజి కంగా, ఆర్థికంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసు కెళ్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ సీతక్కఅన్నారు. శనివారం మండలకేంద్రంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఆత్రం సుగుణక్కను అధికమెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆమె వెంట నాయకులు మునీర్ అహ్మద్, శ్రీనివాస్, బాలునాయక్, తులసీరాం, తిరుపతి, మోతీరాం ఉన్నారు.



ఘనంగా నర్సుల దినోత్సవం

శ్రీరాంపూర్, మే 11: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఆర్కే8 డిస్పెన్సరీలో ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జీఎం బి సంజీవరెడ్డి హాజరై కేక్‌కట్‌చేశారు. అనంతరం మాట్లాడుతూ, నర్సులందరూ అభినందనీయులన్నారు. వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పరిరక్షణకు నర్సులు ఎల్లవేళలా కృషి చేస్తారని కొనియాడారు. అనంతరం ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. డిస్పెన్సరీలో పనిచేస్తున్న నర్సులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఎస్‌వోటు జీఎంవి పురుషోత్తమ రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం(పర్సనల్) పి అరవింద రావు, డిప్యూటీ సీఎంవో డాక్టర్ రమేష్‌బాబు, పర్యావరణ అధికారి హన్మాన్‌గౌడ్, డాక్టర్ మురళీధర్, డాక్టర్ వేదవ్యాసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న జీఎం

రక్షణతో కూడిన ఉత్పత్తే లక్ష్యం



ఓసీపీని పరిశీలిస్తున్న సీఎండీ

శ్రీరాంపూర్, మే 11: రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యంగా పనిచేయాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. శనివారం ఆయన శ్రీరాంపూర్ ఓసీపీని ఆకస్మాత్తుగా సందర్శించారు. ఏరియా జీఎం బి సంజీవరెడ్డితో కలిసి పనిప్రదేశాలను పరిశీలించి, ఓబీ తొలగింపు, బొగ్గు ఉత్పత్తిపై చర్చించారు. శ్రీరాంపూర్ 2024-25ఆర్థిక సంవత్సరం నిర్దేశిత బొగ్గు ఉత్పత్తిని సాధించాలన్నారు. రాబోవు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్వారీలో నీరునిల్వకుండా చూసుకోవాలన్నారు. ఉపరితల గని విస్తీర్ణం 162.45హెక్టార్ల అటవీభూమి స్వాధీన ప్రక్రియను వేగవంతం చేసి గనిని విస్తరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం వి పురుషోత్తమ రెడ్డి, పీవో టి శ్రీనివాస్, ఇన్‌చార్జి మేనేజర్ శ్రీనివాస్, సర్వే అధికారి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్సుల్లో ఏసీలు ఉండాలి

శ్రీరాంపూర్/రామకృష్ణాపూర్, మే 11: ప్రమాదాలు జరిగిన సమయంలో కార్మికులకు తరలించే అంబులెన్సుల్లో ఏసీలు ఉండాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ ఒకప్రకటనలో కోరారు. సింగరేణి యాజమాన్యం కార్మికులను కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించేందుకు కాంట్రాక్టు అంబులెన్సులను వినియోగిస్తోందన్నారు. ఆ వాహనాల్లో ఏసీలు లేకపోవడంతో కార్మికులు, వారి కుటుంబ సభ్యులు అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిపారు. అన్ని అంబులెన్సుల్లో ఏసీ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. రామకృష్ణాపూర్‌లో హెచ్ఎంఎస్ నాయకులు ఈ విషయమై ఆర్కేపీ డిప్యూటీ సీఎంవోకు వినతిపత్రం అంద జేశారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, మే 11: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగాభక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా ఎండ తీవ్రతతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. వందలాదిగా భక్తులు స్వామి వారి సన్నిధిలో హనుమాన్ దీక్ష తీసుకున్నారు. భక్తులకు కావల్సిన ఏర్పా ట్లను ఈవో చంద్రశేఖర్‌తో పాటు అధికారులు పర్యవేక్షించారు.



సిర్పూర్ ప్రజల రుణం తీర్చుకోలేనిది: ఎమ్మెల్యే హరీష్‌బాబు



బెజ్జూరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

బెజ్జూరు, మే 11: తనకు ఎమ్మెల్యేగా అవ కాశం ఇచ్చిన సిర్పూర్ ప్రజల రుణం తీర్చుకో లేనిదని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. తనను ఆదరించినట్లు గానే ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను ఆదరించిన ట్లయితే ఇద్దరం కలిసి జోడెద్దుల్లాగా అభివృద్ధికి కోసం కృషి చేస్తామ న్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లా డారు. ఈప్రాంతంలో తనతండ్రి పురు షోత్తమరావు చేసిన అభివృద్ధి లాగా తాను కూడా పని చేసి రాబోయే రోజుల్లో తన తండ్రిపాలన తీసుక వస్తానన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండ డంతో వంద రోజుల్లో నియోజక వర్గానికి రూ.100 కోట్ల నిధులు తీసుకువచ్చిన్నట్లు తెలిపారు. మరిన్ని నిధులు తెస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ లకు పోడు హక్కుప త్రాలు కల్పించి శాశ్వత పరిష్కారం కల్పిస్తామన్నారు. ప్రధానమంతి ఆవాస్‌యోజన కింద పేదలకు ఇల్లు ఇప్పిస్తా మన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. ఈ సంద ర్భంగా పలువురు బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమం లో సత్యనారాయణ, సుధాకర్‌రావు, భాస్కర్ రాజు, సత్యనారాయణ, బాపు, తిరుపతి, బాల కృష్ణ, రామయ్య, బ్రహ్మయ్య, నీలేష్ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తాం..

పెంచికలపేట: పోడు భూముల శాశ్వత పరిష్కారానికి కృషిచేస్తామని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శనివారం మండ లంలోని ధరోగపల్లి, లోడ్‌పల్లి, కొండపల్లి గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు రైతులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ఫారెస్టు అధికారులను కట్టడి చేసి పోడు రైతులకు రక్షణ కల్పిస్తామని అన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధి బీజేపీతోనేసాధ్యమన్నారు.ఈ సంద ర్భంగా మాజీసర్పంచ్ పరదేశి,చంద్రు, భాస్కర్, పోశన్న, శేఖర్, లోడ్‌పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుల బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పిఆహ్వానించారు. కార్యక్ర మంలో నాయకులు గణపతి, నాగన్న, మధుక్, మహేష్, పురుషోత్తం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

కెరమెరి, మే 11: మండలంలోని కెరమెరి, కేస్లాగూడ, మోడి పోలింగ్ కేంద్రాలను జిల్లాపంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా పోలింగ్‌కేంద్రాలలో మౌలికవసతులను పరిశీలించి పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యాలు కల్పించరాదని అలాగే సిబ్బందికివసతి, భోజనంకల్పించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీవో అంజద్‌పాషా, కార్యదర్శులు భీమయ్య, ధర్మయ్య, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

దహెగాం: మండలంలోని 43పోలింగ్‌కేంద్రాలను సెక్టోరల్ అధికా రులు శనివారం పరిశీలించినట్లు తహసీల్దార్‌కవిత తెలిపారు. పార్ల మెంట్ ఎన్నికలకు సంబంధించి లోహ, పార్వతిపేట, పీపీరావుకాలనీ, చౌక, జెండాగూడ గ్రామాల్లో నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతిపోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలతోపాటు కనీస మౌలిక వసతులు సమకూర్చినట్లు తెలిపారు.



కెరమెరిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీపీవో

కాగజ్‌నగర్ ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

కాగజ్‌నగర్, మే 11: కాగజ్‌నగర్ పట్టణ ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌కా ర్యవర్గం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా తాళ్లపల్లి సురేందర్‌రావు, ప్రధాన కార్యద ర్శులుగా ఎండీ మెహరాజ్, తిరుమలాచారి, కోశాధికారిగా షఫీఉల్లా ఎన్నిక య్యారు. మిగితాపూర్తి కార్యవర్గాన్ని వచ్చేనెలలో ప్రకటిస్తామని అధ్యక్షుడు ప్రకటించారు.











నష్ట పరిహారం అందజేత



నష్ట పరిహారం అందజేస్తున్న డిప్యూటీ ఎఫ్ఆర్వో

వాంకిడి, మే 11: మండలంలోని అంతాపూర్ గ్రామానికి చెందిన సిడాం తానుకు డిప్యూటీఎఫ్ఆర్వో సరోజారాణి రూ.5వేల నష్టపరిహా రాన్ని శనివారం అందజేశారు. ఈనెల9న తానుకు చెందిన లేగదూడపై చిరుతపులి దాడిచేసి చంపేసింది. కార్యక్రమంలో డిప్యూటీఎఫ్ఆర్వో అప్పారావు, ఎఫ్‌బీవో నాగేందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.



అంబలి పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ

ఆసిఫాబాద్, మే 11: ఆసిఫాబాద్‌పట్టణంలో శనివారం వారసంతలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీచేశారు. సంతకు వచ్చే దూర ప్రాంత ప్రజల ఆకలి, దప్పిక తీర్చడానికి అంబలి పంపిణీ చేస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఉబెద్‌బిన్ యాహియా తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు శంకర్, ఎన్.శంకర్, వెంకన్న, అహ్మద్‌బిన్‌అబ్దుల్లా, నిసార్, అబ్దుల్లానవాబ్ పాల్గొన్నారు.

లింగాపూర్‌లో గాలివాన

లింగాపూర్, మే 11: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో శనివారం గాలులతో కూడిన వర్షం కురిసింది. 30 నిమిషాల పాటు కురిసిన వర్షం కారణంగా ఎలాంటి నష్టం వాటిళ్ల లేదని అధికారులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

గులాబీ జెండా ఎగురవేస్తాం: ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ రూరల్, మే 11: పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేస్తామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు ఖాయమైందన్నారు. రాష్ట్రంలో పది సంవత్సరాల పాటు సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమానికి ప్రజలు ఇప్పటికే మద్దతు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు అలీబిన్ అహ్మద్, రవీందర్, సలాం, భీమేష్, రవి, సుగుణాకర్, అశోక్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

పుంజుమేరగూడలో పూజలు..

రెబ్బెన: రెబ్బెన మండలం పుంజుమేరగూడ ఆలయంలో శనివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు పూజలు ని ర్వహించారు. అనంతరం మండలంలో ప్రచార కార్యక్రమాలను చేప ట్టారు. మాజీ సీఎం కేసీఆర్ చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటా వివ రిస్తూ ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరు బీఆర్‌ఎస్‌కు ఓటేయాలని కోరారు. అనంతరం బైక్‌ర్యాలీ నిర్వహించారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

బెజ్జూరు: మండల కేంద్రంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రంసక్కును గెలపించాలని కోరారు. కార్యక్రమంలో భాగ్య, ఖాజాషమియుద్దీన్, రాజన్న, సురేష్ గౌడ్, షణ్ముకచారి, సంజీవ్, మల్లేష్, రితిక్, కళ్యాణ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని జడ్పీటీసీ అజయ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని శివకేశవనగర్, లక్ష్మినగర్, కేబీనగర్, అంబేద్కర్‌నగర్, జగ్జీవన్‌రావు కాలనీలో ఎన్నికలప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత పదేళ్ల టీఆర్‌ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజాసంక్షేమం బీఆర్‌ఎస్‌అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

ఆత్రం సుగుణను గెలిపించాలి

బెజ్జూరు, మే 11: పార్లమెంట్ ఎన్నికలనేపథ్యంలో శనివారం చివరి రోజు మండలకేంద్రంలో కాంగ్రెస్‌నాయకులు భారీర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపునకు మద్దతుగా ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

కాగజ్‌నగర్: ఎస్పీఎం క్రీడా మైదానంలో శనివారం సీపీఎం నాయ కులు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు కలిసి కరపత్రాలను అందజేశారు. కాంగ్రెస్ పార్టీని ఆదరించా లని కోరారు.

రెబ్బెన: మండలకేంద్రంలో మాజీఎమ్మెల్సీ పురాణం సతీష్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఓటేయాలని కోరారు.

వాంకిడి: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు కోరారు. శనివారం ఇందాని హాబిటేషన్‌లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించి ఓటు వేయాలని కోరారు.

తిర్యాణి: మండలకేంద్రంలో శనివారం కాంగ్రెస్‌నాయకులు ఇంటిం టికి వెళ్లి కాంగ్రెస్‌అభ్యర్థి ఆత్రం సుగుణక్కను భారీమెజార్టీతో గెలిపించా లని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ఆసిఫాబాద్‌రూరల్, మే 11: ఆసిఫాబాద్ పట్టణంలో శనివారం డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు నివాసంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రిసీతక్క కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలలో బీజేపీమండలాధ్యక్షుడుశ్రీధర్, మాజీఉపసర్పంచ్ సత్యనారాయణ, తిరుపతి, మాజీఎంపీటీసీలురఘునాథ్,విలాస్ మరో50 మందికి పైగా ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నఅభివృద్ధి పథకాలకుఆకర్షితులై పార్టీలోకిచేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీఅధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, నియోజక వర్గఇన్‌చార్జి అజ్మీరశ్యాంనాయక్, మల్లేష్, బాలేష్‌గౌడ్, దత్తు, ఆసీఫ్, ప్రతాప్,శ్యాంరావు పాల్గొన్నారు.

దహెగాం:మండలంలోని లగ్గాం, చౌకగ్రామానికి చెందిన30మంది కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిరావిశ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం

ఏసీసీ, మే 11: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచనల మేరకు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వస్తువులను అడ్డుకొంటామన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. స్ట్రాటజికల్ సర్వేయలెన్స్ టీంలు, కండక్ట్ కోడ్ టీంలు, కేంద్ర బలగాలతో పటిష్ట భద్రత చేపట్టినట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పారామిలటరీ దళాలతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.1.79 కోట్ల నగదు, రూ.81 లక్షల విలువ గల బంగారం, వెండి, రూ.4 లక్షల విలువైన గంజాయి, 2 వేల లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 671 కేసుల్లో 1444 మందిని పలు సెక్షన్‌ల కింద బైండోవర్ చేసినట్లు తెలిపారు. సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్ ఐదు కంపెనీల నుంచి 443 మంది సిబ్బంది వచ్చారని తెలిపారు. ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ప్రజలు ఓటు వేయాలన్నారు. ఈ సమావేశంలో పోలీసులు పాల్గొన్నారు.



కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

ఎన్నికల విధులు సజావుగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ

ఎన్నికల విధులు సజావుగా నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాలులో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలీసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏమైనా సమస్య తలెత్తితే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈవీఎంల తరలింపు, పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు, ఈవీఎంలను తిరిగి స్ట్రాంగ్‌రూంలను చేర్చే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రూట్‌మొబైల్ ఇన్‌చార్జి అధికారులకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఫ్రీ అండ్ ఫేర్ ఎన్నికల నిర్వహణే ప్రధాన లక్ష్యంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు క్యూలైన్ పాటిస్తూ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. కేంద్రాల వద్ద ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టే వారిని అదుపులోకి తీసుకుని ఎన్నికల నియామవళి ప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. డీసీపీ అశోక్‌కుమార్, ఏసీపీ ప్రకాష్, పట్టణ ఇన్‌స్పెక్టర్ బన్సీలాల్, రూరల్ సీఐ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

మంచిర్యాల కలెక్టరేట్, మే 11 : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా అవసరమైన పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్ పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు రావేష్ గుప్తా వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనగా పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించామన్నారు. 888 మంది ప్రిసైడింగ్ అధికారులు, 888 మంది సహాయప్రిసైడింగ్ అధికారులు, 1776 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు, 95 మంది సూక్ష్మ పరిశీలకుల ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. డీఈవో యాదయ్య, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్నా రాజేశ్వర్, ఈ డిస్ట్రిక్‌మేనేజర్ సునీల్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న కలెక్టర్

నర్సులకు సన్మానం


నర్సులను సన్మానిస్తున్న అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, మే 11: అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఆదివారం పురస్కరించుకుని శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నర్సులను సన్మానించారు. రక్తనిధి కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి నర్సులు సుకన్య, ఉమామహేశ్వరి, పద్మ, అరుణ, అపరంజి, మల్లీశ్వరి, సంధ్య, రేఖలను సన్మానించారు. ఆర్ఎంవో డాక్టర్ భీష్మ, ప్రొఫెసర్ వేద వ్యాస్, రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి, మహేందర్, శ్రీనివాస్, సంతోష్‌కుమార్, మాధ వి, మౌనిక, కౌసల్య, తిరుపతి పాల్గొన్నారు.

మోడల్ కాలేజీలో అడ్మిషన్‌లకు ఆహ్వానం

మందమర్రిరూరల్, మే 11: మందమర్రిలోని మోడల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందన్నారు. ఈ నెల 25లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

సత్యదేవున్ని దర్శించుకున్న జైళ్ల శాఖ ఐజీ


గూడెం ఆలయంలో జైళ్లశాఖ ఐజీ

దండేపల్లి,మే 11: గూడెం సత్యనారాయణస్వామి దేవస్థానంలో జైళ్ల శాఖ ఐజీ ఎర్రంశెట్టి రాజేష్ దంపతులు శనివారం సత్యదేవున్ని దర్శించుకొన్నారు. ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ అర్చకులు, సిబ్బంది ఐజీ దంపతులను ప్రధానాలయం వరకు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. వ్రత మండపంలో సత్యనారాయణస్వామి సామూహిక వ్రతం ఆచరించారు. అనంతరం వేదపండితులు, అర్చకులు స్వామివారి ఆశీర్వచనం అందించి శేషవస్త్రాలతో సన్మానించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

లక్షెట్టిపేటరూరల్, మే 11: మిట్టపల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శనివారం పంచాయతీ కార్యదర్శికి గ్రామస్థులు వినతిపత్రం అందించారు. సర్వే నెంబరు 33లో అనుమతులు లేకుండా వెంచర్ ఏర్పాటు చేశారని, చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వనంలోని మొక్కలు ఎండిపోయాయని తెలిపారు. వీధి లైట్లు సరిగ్గా వెలగడం లేదని, సమస్యలను పరిష్కరించేలా చూడాలన్నారు. బానేష్‌మల్లయ్య, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

లక్షెట్టిపేటరూరల్, మే 11: ఉత్కూరు చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాంధీనగర్‌కు చెందిన ఎలగందుల చంద్రమౌళి (58) అనే వ్యక్తి మృతి చెందాడు. చంద్రమౌళికి రెండు వ్యాన్‌లు ఉండగా వాటిని బాలాజీ రైసు మిల్లులో అద్దెకు పెడుతుంటాడు. శుక్రవారం రాత్రి స్కూటీపై రోడ్డు దాటుతుండగా ఎదురుగా బైక్‌పై ఉత్కూరు చౌరస్తా నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న ముల్కల్ల ప్రశాంత్ ఢీకొట్టడంతో చంద్రమౌళి గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. మృతుడి కుమారుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. ప్రశాంత్‌కు గాయాలు కావడంతో హైద్రాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

ముగ్గుతో ఓటుపై అవగాహన

మంచిర్యాల కలెక్టరేట్, మే 11 : ప్రతీ ఒక్కరు ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని రెడ్డి కాలనీకి చెందిన బోడ రీనారాణి దాస్‌దేవేందర్ ఇంటి ఎదుట శనివారం ముగ్గు వేసి అవగాహన కల్పించారు. ముగ్గులో మన ఓటు మన హక్కు, ఓటు వేద్దాం, ప్రజాస్వామ్యాన్ని గెలిపిద్దాం అని రాశారు.



సింగరేణి కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

మందమర్రిటౌన్, మే 11: సింగరేణి కార్మికులు, ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కోరారు. శనివారం గనులు, డిపార్టుమెంట్ల కార్మికులను కలిసి చేతి గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ దేశంలో మోదీ మనువాదంతోనే మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నాడన్నారు.

సింగరేణి సంస్థకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అండగానే ఉంటుందని, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించడం ద్వారా మరిన్ని హక్కులు సాధ్యమవుతాయని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్యలు తెలిపారు. సింగరేణి ఉద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ దాని అనుబంధ సంఘాల నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి కోల్‌బెల్ట్ రోడ్డు మీదుగా మార్కెట్ వరకు కొనసాగింది. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరారు.

గడ్డం వంశీకృష్ణకు మద్దతు తెలుపుతున్నట్లు కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు గుంట శ్రీశైలం తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: దేశాన్ని మతోన్మాదుల నుంచి రక్షించడానికి ఇండియా కూటమి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని సీపీఐ, ఏఐటీయూసీ, కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం సీపీఐ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరి బాబు, సీపీఐ రాష్ట్ర నాయకుడు మిట్టపల్లి వెంకటస్వామిలు మాట్లాడుతూ మతోన్మాదుల నుంచి దేశాన్ని కాపాడుతూ దేశ పరిరక్షణకు కార్మిక వర్గ హక్కుల పరిరక్షణకు మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు.


మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లో ఆర్‌కె 7 గనిపై ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణకు మద్దతుగా ఐఎన్‌టీయూసీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఏరియా ఉపాధ్యక్షుడు జె. శంకర్‌రావు ఆధ్వర్యంలో కార్మికులను కలిసి చేతి గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని 5వ వార్డు కొత్త రోడ్డు, హన్మాన్‌నగర్, లక్ష్మీనగర్, తదితర కాలనీల్లో కాంగ్రెస్ నాయకులు, మహిళలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లో గేట్ మీటింగ్ నిర్వహించి కరపత్రాలు విడుదల చేశారు.

ఏసీసీ: ఇండియా కూటమి అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఆమ్ ఆద్మీ పార్టీ మద్దతు ఇస్తుందని పార్టీ జిల్లా కన్వీనర్ నాగేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరు చేతి గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు.

బీజేపీ నాయకుల ప్రచారం

తాండూర్, మే 11: మండలంలోని నీలాయపల్లిలో బీజేపీ నాయకులు శనివారం ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి కూలీలతో బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేకు ఓట్లు వేయాలని కోరారు. అలాగే 132, 133 బూత్‌లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. మహీదర్‌గౌడ్, దూడపాక భరత్, నాగరాజు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలని సండ్రోన్‌పల్లి, చిర్రకుంట ఆదిల్‌పేట గ్రామాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆధ్వర్యంలో నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. సంజీవరావు, అందుగుల శ్రీనివాస్, శివకుమార్ పాల్గొన్నారు.

చెన్నూరు, మే 11 : బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలని శనివారం చెన్నూరు పట్టణంలో బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, రాపర్తి వెంకటేశ్వర్, కౌన్సిలర్ కమ్మల శ్రీనివాస్, నాయకులు బత్తుల సమ్మయ్య, జాడి తిరుపతి, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బైక్ ర్యాలీ

ఏసీసీ, మే 11: మంచిర్యాల పట్టణంలో శనివారం బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆధ్వర్యంలో నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. బైపాస్ రోడ్డు, ఐబీ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, మార్కెట్ ఏరియా, ముఖరాంచౌరస్తా మీదుగా శ్రీనివాస థియేటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడే పార్టీ బీఆర్ఎస్ అన్నారు. సింగరేణి కార్మికులకు యువతకు, మహిళలకు న్యాయం జరగాలంటే కారు గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఓసీపీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, అక్కూరి సుబ్బయ్య, పవన్ కుమార్, సురేందర్ రెడ్డి, పెట్టెం లక్ష్మణ్, బండి రమేష్ పాల్గొన్నారు.

మాదిగల అభివృద్ధి హామీ ఇచ్చిన కాంగ్రెస్‌కు మద్దతు

నస్పూర్, మే 11 : మాదిగల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చిన మేరకు పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి వంశీ కృష్ణకు మద్దతు ఇస్తున్నామని మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డి) రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునిల్ మాదిగ తెలిపారు. నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంబేద్కర్ ఇచ్చిన రిజర్వేషన్లను రక్షించుకోవడానికి కాంగ్రెస్‌కు మద్దతు తెలియజేస్తున్నట్లు తెలిపారు. మందమర్రిలో లెదర్ పార్క్ పరిశ్రమ ప్రారంభించి మాదిగలకు ఉపాధి కల్పిస్తామని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణలు హామీ ఇచ్చారన్నారు. 2002లో మోదీ నరహంతకుడు అన్న మందకృష్ణ 2024కు వచ్చే సరికి తన స్వంత ప్రయోజనాల కోసం బీజేపీకి మద్దతు తెలపడం ఎంతవరకు సమంజసమని, తద్వారా మాదిగ జాతిని మోసం చేస్తున్నా రని ఆరోపించారు. మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడు కడారి రమేష్, పట్టణ అధ్యక్షుడు ఆటకపురం సమ్మయ్య, నాయకులు లింగయ్య, సంతోష్, బాబన్న, సాగర్, సంజయ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రేగుంట సునిల్ మాదిగ

కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు రక్షణ లేదు

ఏసీసీ, మే 11: కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు రక్షణ లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దండేపల్లి మండలం చింతపల్లి గ్రామానికి చెందిన మహిళా మోర్చా అధ్యక్షురాలు అక్కల దివ్యపై శుక్రవారం ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ అనుచరులు దాడి చేయడంతో గాయపడిందన్నారు. ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ప్రజలను మభ్య పెట్టి ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నారన్నారు. బీజేపీ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేయడం దారుణమన్నారు. జోగుల శ్రీదేవి, అక్కల దివ్య, స్వాతి, వాణి పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి

చెన్నూరు, మే 11: కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి చంద్రకళ శనివారం పేర్కొన్నారు. సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలకు తరలించే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లతోపాటు అందుకు సంబంధించిన సామగ్రిని సిద్ధంగా ఉంచామన్నారు. ఎన్నికల సిబ్బంది ఆదివారం ఉదయం 10గంటలకు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

స్నేహితుల కుటుంబాలకు చేయూత

జైపూర్, మే 11: జైపూర్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996-1997లో చదువుకున్న స్నేహితులకు వారి మిత్రులు చేయూతనందించారు. రసూల్‌పల్లి గ్రామానికి చెందిన రాయలింగు ఇటీవల మరణించగా వారికి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. భైంసా మండలం చెక్‌పల్లిలో చిన్ననాటి స్నేహితుడు రవీందర్ కుమార్తె ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మిత్రులు గుండు తిరుపతి, మద్దుల సురేందర్‌రెడ్డి, కట్కూరి సత్యనారాయణ, సాయిబాబ, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లోవ భీమయ్య స్వామి పూజలు

కాసిపేట, మే 11: పెద్దాపూర్ కొలాంగూడలో కొలాం గిరిజనులు సంప్రదాయ దేవతలకు శనివారం పూజలు నిర్వహించారు. లోవ భీమయ్య స్వామికి డోలు వాయిద్యాలతో ఊరి బయటకు వెళ్లి దేవతలకు పూజలు చేశారు. కుటుంబాలను చల్లగా కాపాడాలని కోరుకున్నారు.

కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్


కాసిపేటలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న ఏసీపీ రవికుమార్

కాసిపేట, మే 11 : కాసిపేట మండల కేంద్రంలో శనివారం బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ఏసీపీ మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతీ ఒక్కరు ఓటు వేయాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. సీఐ శశిదర్‌రెడ్డి, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.


మద్యం పట్టివేత



భీమిని, మే 11: మండలంలోని వడాల గ్రామంలో ఎన్నికల అధికారులు శనివారం మద్యం పట్టుకున్నారు. సీవిజిల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో అధికారులు వడాల గ్రామానికి చెందిన పంజాల శ్రీనివాస్‌గౌడ్‌కు చెందిన ఇంట్లో రూ.42,800ల మద్యం సీజ్ చేశారు. ఈ దాడుల్లో టీం లీడర్ అనిల్‌బాబు, ఏఎస్ఐ హమానుల్లాఖాన్, గజెల్లి రఘు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

కాసిపేట, మే 11 : కోనూరు పంచాయతీలోని తంగళ్లపల్లికి చెందిన అక్కెనపల్లి రవీందర్ పోగొట్టుకున్న ఫోన్‌ను శనివారం దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు అప్పగించారు. ఆయన మాట్లాడుతూ రవీందర్ ఫోన్‌ను పోగొట్టుకోగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితునికి అందజేశామని తెలిపారు.



ప్రచారానికి తెర..

ప్రలోభాలకు ఎర..

● ముగిసిన ఎన్నికల ప్రచారం ● ఇక ఎన్నికలే తరువాయి

● ఓటర్ల మద్దతు కోసం అభ్యర్థుల పాట్లు

మంచిర్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఇంతకాలం హోరెత్తించిన మైకులు మూగబోయాయి. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు శనివారం సాయంత్రం 6 గంటల నుంచి అభ్యర్థులు తమ ప్రచారాలు ముగించారు. ఏప్రిల్ 18న కేంద్ర ఎన్నికల కమిషన్ లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేయగా, అదే రోజు నుంచి అభ్యర్థులు ప్రచారాలు ప్రారంభించారు. ఏప్రిల్ 25తో నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగియడంతో అభ్యర్థులు ప్రజా క్షేత్రంలోకి వెళ్లారు. రాత్రనకా, పగలనకా ప్రజలతో మమేకం అవుతూ ఓట్ల వేటలో మునిగిపోయారు. సభలు, సమావేశాలతో ప్రచారం హోరెత్తించారు. అభ్యర్థులతో పాటు ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు కూడా అలుపెరగకుండా ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారం సమయం ముగియడంతో గత 25 రోజులుగా ఇళ్లదారి పట్టని నాయకులంతా ప్రస్తుతం సేదదీరుతున్నారు.

ఇక తనిఖీలు ముమ్మరం: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ప్రచారం ముగియడంతో, ప్రలోభాలకు తెరలేచే అవకాశం ఉండటంతో పోలీసులు ఆ దిశగా దృష్టి సారిస్తున్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వస్తువులు, నగదు సరఫరా కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఇందులో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటికల్ సర్వేలెన్స్ టీమ్స్, కండక్ట్ కోడ్ టీమ్స్, స్టారికల్ సర్వేలెన్స్ టీమ్స్, చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24 గంటలు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. నగదు, మద్యం రవాణా జరుగకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

జిల్లాలో 144 సెక్షన్ అమలు: ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో శనివారం సాయంత్రం 6 నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఈ సమయంలో ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది తిరగకూడదని పేర్కొన్నారు.

జిల్లాలో 4 గంటల వరకే పోలింగ్..: జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకే నిర్వహించనున్నారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం741 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటిలో 49 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా జిల్లా ఎన్నికల అధికారులు గుర్తించారు. అభ్యర్థులకు మద్దతుగా వివిధ ప్రాంతాల నుంచి ప్రచారం కోసం వచ్చిన నాయకులు, కార్యకర్తలు వారి వారి స్వస్థలాలకు తరలివెళుతున్నారు.

అవకాశం ఇవ్వండి... అభివృద్ధి చూపిస్తా





ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, బైక్ ర్యాలీలో గడ్డం వంశీ, వివేక్

చెన్నూరు, మే 11: పార్లమెంట్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓట్లు వేసి తనను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. శనివారం ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామితో కలిసి చెన్నూరులో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మి ఎవరు మోసపోవద్దన్నారు. ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో గడ్డం వంశీకృష్ణను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జలాల్ పెట్రోల్ బంకు నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎంఆర్ఆర్ గార్డెన్ వరకు కొనసాగింది. తీన్మార్ మల్లన్న, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏసీసీ: జిల్లా కేంద్రంలో పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నివాసం నుంచి ప్రారంభమైన ర్యాలీ లక్ష్మీ థియేటర్ చౌరస్తా, బెల్లంపల్లి చౌరస్తా, రైల్వేస్టేషన్, శ్రీరాంపూర్ వరకు కొనసాగింది. గడ్డం వంశీకృష్ణ చేతి గుర్తుకు ఓటువేయాలని కోరారు. దాదాపు 2 వేల బైక్‌లతో ర్యాలీ కొనసాగింది. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దేశంలో ఇండియా కూటమిదే విజయం

మందమర్రిటౌన్: దేశంలో ఇండియా కూటమి విజయం సాధిస్తుందని, రాష్ట్రంలో 14 సీట్లు గెలవడం ఖాయమని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందంతో కలిసి మామిడిగూడలో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో పదేళ్ల బీజేపీ పాలన, రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనకు పెద్ద తేడా ఏమి లేదన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

మందమర్రిరూరల్: ఎన్నికల్లో విద్యావంతుడు, యువకుడైన పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. అందుగులపేటలో ఉపాధి కూలీలను కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు.

బెల్లంపల్లి: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి అన్నారు. మహ్మద్‌ఖాసీం బస్తీ, కాంటా చౌరస్తా ఏరియాలో ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.





కార్మికుడికి.. ఆగర్భ శ్రీమంతుడికి మధ్య పోటీ

గ్యారంటీలను అమలు చేయని రేవంత్

పన్నులు పెంచి పేదవాడి నడ్డి విరిచిన మోదీ

చెన్నూరు ప్రజా ఆశీర్వాద సభలో కేటీఆర్





ప్రజలకు అభివాదం చేస్తున్న కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, సభకు హాజరైన ప్రజలు

చెన్నూరు, మే 11: పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో గని కార్మికుడికి ఆగర్భ శ్రీమంతుడికి మధ్య పోటీ నెలకొందని పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి హాజరై సభలో ప్రసంగించారు. ఈశ్వరునికి కోటీశ్వరునికి, గుణవంతుని, ధనవంతునికి మధ్య జరుగు తున్న పోటీలో గెలిచేది ఎవరు, గెలిపించాల్సింది ఎవరినో మీరే నిర్ణయించుకోవాలన్నారు. పెళ్లికి బంగారం అని, ఉచిత బస్సు అని, మహిళకు రూ. 2500 నగదు, రూ. 4 వేల పింఛన్‌ల పెంపు, రూ. 2 లక్షల రుణమాఫీ, ధాన్యానికి బోనస్ అని చెప్పిండ్లు, ఇందులో ఏదైనా అమలైందా అని ఆయన ప్రశ్నించారు. కారు గుర్తుకు ఓట్లు వేసి ఈశ్వరన్నను గెలిపించాలని కోరారు. ఈ ప్రాంతాన్ని చూస్తే నాకు బాధ వేస్తుందని, ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలకు కోట్లాది నిధులు తీసుకువచ్చిన సుమన్ ఓడిపోగానే పనులను రద్దు చేయడం సరైంది కాదన్నారు.

రేవంత్‌కు ఓటు వేసినా, మోదీకి ఓటు వేసినా సింగరేణిని ఆదానికి అమ్మేస్తారన్నారు. కరెంటు కోతలు పెరిగాయని, పంటలు ఎండిపోతున్నాయని, ఫలితంగా రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. దేశంలో పన్నుల రూపంలోనే మోదీ ప్రభుత్వం 30 లక్షల కోట్లు వసూలు చేసి 15 లక్షల కోట్లను ఆదాని, అంబానీలకు కట్టబెట్టిందన్నారు. నేను చెప్పింది అబద్ధమని బీజేపీ నాయకులు ఒక్కరు నిరూపించినా ఎమ్మెల్యే పదవికి చెన్నూరు నుంచే రాజీనామా చేస్తానన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపిస్తే ఈ ప్రాంత ప్రజలకు అండగా ఉంటానని ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ అభి వృద్ధి నిరోధకుడని, తమ ప్రభుత్వ హయాంలో తెచ్చిన అభివృద్ధి పనులను రద్దు చేశాడని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ధ్వజమెత్తారు. సభ ముగిసిన తర్వాత పట్టణంలోని మారెమ్మవాడకు చెందిన సోషల్ మీడియా వారియర్ ఎనగందుల ప్రశాంత్ ఇంట్లో కేటీఆర్ నాయకులతో కలిసి భోజనం చేశారు.

ఈవీఎంల పంపిణీ ప్రక్రియలో

అప్రమత్తంగా వ్యవహరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, మే 11: మంచిర్యాల, చెన్నూరు, అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌కు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పంపిణీ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను ఆర్డీవో రాములుతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకొంటున్నామన్నారు. మూడు సెగ్మెంట్లలో 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఈవీఎంలను కేటాయించామని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఈవీఎంల పంపిణీ కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ సిబ్బందిని, ఈవీఎంలను తరలించడంతోపాటు పోలింగ్ ముగిసిన అనంతరం తిరిగి తీసుకువచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.



డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

అర్హులందరూ ఓటు వేయాలి



5కే రన్ నిర్వహిస్తున్న అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, మే 11: అర్హులందరు ఓటు హక్కు వినియోగించుకోవాలని అద నపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. శనివారం జిల్లా కేం ద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఓటరు చైతన్యం పై చేపట్టిన 5కే రన్‌ను డీఆర్‌డీవో కిషన్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగం భారత పౌరులకు కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధమని పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, సకాలంలో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. చిన్నయ్య, గంగారాం, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, రమేష్, మున్సిపల్ కమీషనర్‌లు మారుతి ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.